నిప్పు ముప్పు తప్పేలా!


ఆదోని జిన్నింగ్ ఫ్యాక్టరీలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

■ ఆదోని పట్టణంలోని మాధవరం రోడ్డులో ఉన్న నాగరాజు అండ్ సన్స్ ప్రెస్సింగ్ అండ్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఈనెల 14వ తేదీ తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు ఫైర్ అధికారులు అక్కడికి చేరుకుని మంటలను అదుపులో తీసుకొచ్చారు. ప్రమాదంలో రూ. 4 కోట్ల వరకు నష్టం వాటిల్లింది.

■ హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో గతేడాది ఇదే మాసంలో జరిగిన అగ్నిప్రమాదంలో 15 నుంచి 20 వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఫైర్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చి ఆస్తినష్టాన్ని నివారించారు. ఇలా ఆలూరు నియోజకవర్గంలో ప్రతి ఏడాది వేసవి కాలంలో ఏదో ఒక చోట అగ్నిప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి.

- వేసవిలో పొంచి ఉన్న అగ్ని ప్రమాదాలు
- నివారణ చర్యలు చేపట్టిన అధికారులు
- ఈనెల 14 నుంచి 20వరకు అగ్నిమాపక వారోత్సవాలు
- వివిధ రూపాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

ఆలూరు రూరల్: ఓ వైపు ఎండలు దంచేస్తున్నాయి. బయటకు రావాలంటే జనం భయపడుతున్నారు. ఇదే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు కూడా ఎక్కువే. ఈ నేపథ్యంలో అగ్ని ప్రమాదాల తీవ్రత తగ్గించి ప్రాణాలను,ఆస్తులను కాపాడేందుకు అగ్నిమాపక శాఖ మాక్‌డ్రిల్‌తో ప్రజలకు అప్రమత్తం చేస్తోంది. ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ముందు జాగ్రత్తలు తీసుకుంటే ప్రాథమిక దశలోనే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. 1944వ సంవత్సరం ముంబాయి డాక్ యార్డ్‌లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు మంటలార్పేందుకు వెళ్లిన 66 మంది ఫైర్ సిబ్బందితో పాటు అనేక మంది ప్రమాదంలో మృతిచెందారు. వారి ఆత్మకు శాంతి చేకూర్చేందుకు ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించి..అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అగ్నిమాపక అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.


మంటలను ఆర్పడంపై ఆలూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

అవగాహన సదస్సులు

అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న అమర వీరులకు నివాళులర్పించారు. ఇందులో భాగంగానే శనివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్, సంత మార్కెట్ కూడళ్లలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. 16న అపార్ట్‌మెంట్లు, 17న విద్యా సంస్థలు, 18న గ్యాస్ గోడౌన్‌లు, 19న అస్పత్రులు, పెట్రోల్ బంకుల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. ఈ నెల 20న అన్ని వర్గాల ప్రజలకు ఫైర్ సెఫ్టీ పై కరపత్రాలు పంచుతూ.. విన్యాసాలు చేస్తూ.. అవగాహన కల్పిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పని సరి..

- చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాసులు వంటివి ఇవ్వకూడదు
- దుస్తులకు నిప్పంటుకుంటే పరిగెత్తకండా దుప్పటి వంటికి కప్పుకోవాలి
- వంట గదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్ అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచకూడదు.
- మండుతున్న పొయ్యి వద్ద వస్తువులను దూరం నుంచి అందుకోవాలి
- చెడిపోయిన గ్యాస్ ట్యూబ్ స్థానంలో ఐఎస్ఐ మార్కు గల కొత్త పైపును అమర్చాలి

అప్రమత్తంగా ఉండాలి



అగ్నిప్రమాదాలు సంభవించకుండా ఉండాలంటే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అజాగ్రత్తతోనే ఎక్కువ అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి. ప్రమాదం సంభవిస్తే 101 నంబర్‌కు కాల్ చేయాలి. పాఠశాలలు, ఆస్పత్రులు, దుకాణాలు, సినిమా హాళ్లు, పరిశ్రమల్లో అగ్నిమాపక నివారణ పరికరాలు తప్పని సరిగా అందుబాటులో ఉంచాలి. నిబంధనలు పాటించకుంటే ఫైర్ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తాం.

– ఖాద్రి,ఫైర్ అధికారి,ఆలూరు

క్లుప్తంగా

ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి


నందవరంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

నందవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సూచించారు. శనివారం మండల కేంద్రం నందవరం జగనన్న కానీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అలాగే హాలహర్వి జగనన్న కాలనీలో థర్డ్ పార్టీ గృహ నిర్మాణాలను ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ గురుస్వామి ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ లబ్ధిదారులతో మాట్లాడారు. కాలనీల్లో ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షలతో పాటు పొదుపు మహిళలకు అదనంగా రూ.35వేలు ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని హౌసింగ్ కార్యాలయ సమీపంలో వెంకటాపురానికి చెందిన ఆటో వెంకటేష్, రంగస్వామి, ఆదెన్న తదితర ఆటో డ్రైవర్లు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేశన్న, వైఎస్ఆర్‌సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బసరకోడు వీరేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు బజారి, శివప్రసాద్, పార్టీ నాయకులు కోటేకల్ లక్ష్మన్న, గట్టుఖాజ, మన్సూర్‌బాషా , వడ్డేరం గన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

ఎమ్మిగనూరుటౌన్: ముందస్తు అవగాహనతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చునని ఎమ్మిగనూరు ఫైర్ ఆఫీసర్ రామాంజినేయులు, పట్టణ ఎస్ఐ మస్తాన్‌వలి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని శివ సర్కిల్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. అనంతరం అగ్నిప్రమాదాలు, వాటిని నివారించే అంశాలపై ప్రజలకు కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో స్థానిక అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

'సహకార' అధ్యక్షుల ఎన్నిక


ఆలూరు అధ్యక్షురాలు హనుమంతమ్మ


బెల్డోణ అధ్యక్షుడు మల్లికార్జున

ఆలూరు రూరల్: ఆలూరు, బెల్డోణ సహకార పరపతి సంఘాలకు అధ్యక్షులను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలూరుకు అధ్యక్షురాలిగా వైఎస్సార్ సీపీకి చెందిన హనుమంతమ్మ, సభ్యులుగా వెంకటేషులు, నగరి మారెప్పలను ఎన్నుకున్నారు. అలాగే చిప్పగిరి మండలం బెల్డోణకు దేగుల హాలు మల్లికార్జునను ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో వారిని ఆయా సహకార సంఘాల కార్యాలయాల్లో సభ్యులు సత్కరించారు. నూతనంగా ఎన్నికైన వారు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీని గద్దె దింపాలి


ప్రచార భేరిలో వామపక్ష నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీపీఐ, సీపీఎం నాయకులు రంగన్న, రాముడు పిలుపునిచ్చారు. శనివారం ఆయా పార్టీల ఆధ్వర్యంలో ప్రచార భేరి పాదయాత్ర చేపట్టారు. పట్టణంలోని మైనారిటీ కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాను ప్రజలకు వివరించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా విభజన చట్టంలోని హామీలను నెరవేర్చకుండా మోదీ సర్కారు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు బాలరాజు, సమీవుల్లా, బజారి, జబ్బార్, దాదావలి, మల్లికార్జున గౌడ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రవచనం

హొళగుంద: స్థానిక సిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కల్బుర్గి శ్రీశరణ బసవేశ్వరస్వామి పురాణ ప్రవచన కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి శ్రీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రవచన కారుడు సిద్ధరామయ్యస్వామి శరణ బసవేశ్వరస్వామి లీలలు గురించి వివరించారు. ధర్మకర్తలు రాజ పంపన్న గౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రవచనం చేస్తున్న దృశ్యం

ముస్లింలు ఐకమత్యంతో మెలగాలి

- రంజాన్ తోఫా పంపిణీలో పోచంరెడ్డి మురళీధర్‌రెడ్డి

మద్దికెర: ముస్లింలు ఐకమత్యంతో మెలిగి ఉన్నతంగా ఎదిగినప్పుడే జీవితానికి సార్థకత లభిస్తుందని పోచంరెడ్డి సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోచంరెడ్డి మురళీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో 350 కుటుంబాలకు చక్కెర, సేమియా, ఖర్జూరాలతో పాటు 9 రకాల వస్తువులతో కూడిన రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముస్లింలు 30 రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేసి ఎంతో పవిత్రంగా రంజాన్ పండుగ జరుపుకుంటారన్నారు. ప్రతి కుటుంబం ఈ వేడుక చేసుకోవాలని తోఫా అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ప్రతి ముస్లిం కుటుంబంలో ఇద్దరికి రూ.4 లక్షల బీమా వర్తించేలా ఇన్సూరెన్సు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మూలింటి ఆదినారాయణ, నబర సూల్, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.


రంజాన్ తోఫా అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత పోచంరెడ్డి మురళీధర్‌రెడ్డి

క్రైం కార్నర్

కర్ణాటక మద్యం స్వాధీనం

నందవరం : అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని నందవరం పోలీసులు అరెస్టు చేశారు. పోనకలదిన్నె గ్రామంలో గొల్ల చంద్రన్న అనే వ్యక్తి హోటల్ వద్ద గుట్టుగా కర్ణాటక మద్యం అమ్ముతున్నాడు. సమాచారం అందడంతో ఎస్ఐ మహేష్‌కుమార్ పోలీసు సిబ్బందితో తనిఖీ చేయించారు. నిందితుడి నుంచి 146 ఒరిజినల్ చాయిస్ డీలెక్స్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డివాము దగ్ధం

హొళగుంద: స్థానిక పాత పోలీస్ స్టేషన్ ఎదురుగా హోటల్ కట్టెమ్మకు చెందిన గడ్డివాము శనివారం కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు బాధితురాలు ఆరోపించారు. తనకు రూ.50 వేలు వరకు ఆస్తినష్టం జరిగినట్లు వెల్లడించారు. ఎస్ఐ అబ్దుల్‌జహీర్ అక్కడికి చేరుకుని చుట్టు పక్కల గుడిసెలకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఎమ్మిగనూరురూరల్: పట్టణ పరిధిలోని సర్దార్ పురం సమీపంలో గత కొన్ని నెలలుగా దేవేంద్ర, వెంకటేష్ అనే ఇద్దరు వ్యక్తులు పేకాట స్థావరం నిర్వహిస్తున్నారు. ఇక్కడికి మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు, నందవరంతో పాటు ఇతర ప్రాంతాల వారు వచ్చి పేకాటాడుతున్నారు. ఈ సమాచారం జిల్లా ఎస్పీకి అందడంతో ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం టౌన్ సీఐ మదుసుధన్‌రావు, ఎస్ఐ మస్తాన్‌వలి పేకాటస్థావరంపై దాడిచేశారు. ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ. 10,3,900 నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో 16 మంది తప్పించుకెళ్లారు. ఈ విషయాన్ని టౌన్ సీఐ మదుసుధన్ రావు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడించారు. పరారీలో ఉన్న వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. నిర్వాహకులు దేవేంద్ర, వెంకటేష్‌లను కూడా ఈకేసులో నిందితులుగా చేర్చినట్లు చెప్పారు.

విన్నపం

కొండను తొలగించండి

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్ల ఎస్సీ కాలనీలో నరసప్ప దేవాలయం దగ్గర ఉన్న కొండ తొలగించి తమకు రక్షణ కల్పించాలని కాలనీ వాసులు మునెప్ప, బజారి, వెంకటేష్ కోరారు. ఎండ వేడిమికి గత ఆదివారం మధ్యాహ్నం కొండ రెండుగా చీలిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ఎస్సీ కాలనీ వాసులు తహసీల్దార్ వేణుగోపాల్‌ను కలిసి కొండను తొలగించాలని వినతిపత్రం అందజేశారు.

పన్ను మినహాయింపు ఇవ్వాలి

మద్దికెర: మద్దికెర గ్రామంలో చేతు వృత్తులు చేసుకుంటూ జీవనం చేస్తున్న వారికి పంచాయతీ వారు విధించే పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు వీరేంద్ర అన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామాంజులు, సత్యనారాయణ, ఓబులేసు, హనుమంతు, రంగస్వామి పాల్గొన్నారు.

స్పోర్ట్స్

18 నుంచి క్రికెట్ టోర్నమెంట్

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా ఈ నెల 18 నుంచి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతుల కింద రూ. 20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలను దాతల సహకారంతో అందజేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు ఈ 16లోపు రూ.600 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7981403821, 9381657582, 6302115162 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కబడ్డీ విజేత ఆదోని జట్టు

ఆదోని అర్బన్ : అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక న్యూ గాంధీనగర్‌లో అండర్–19 కబడ్డీ పోటీలు నిర్వహించారు. మొత్తం 20 జట్లు పాల్గొనగా ఆదోని ఫిలిప్స్ జట్టు విజయం సాధించింది.

నోటీస్ బోర్డు

నేడు ఐదో తరగతి ప్రవేశ పరీక్ష

వెల్దుర్తి: మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో ఈ పరీక్ష నిర్వహణకు మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో వెల్దుర్తిలోని రామళ్లకోట రోడ్డులో పెట్రోల్ బంక్ పక్కన ఉన్న ఎమ్‌జేబీపీ బాలికల గురుకులం ఒకటని గురుకులం ప్రిన్స్‌పాల్/పరీక్ష సూపరింటెండెంట్ షబానా బేగం శనివారం తెలిపారు. తమ పరీక్ష కేంద్రానికి 431మంది విద్యార్థులను కేటాయించినట్లు వెల్లడించారు. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు 2 గంటల పాటు ఆబ్జెక్టివ్ పద్ధతిలో పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు పరీక్ష హాలుకు అరగంట ముందు చేరుకోవాలని, వెంట హాల్ టికెట్‌తోపాటు ఐడీ ప్రూఫ్ (ఏదైనా గుర్తింపు కార్డు)తో హాజరుకావాలని తెలిపారు. మాస్క్ తప్పని సరి అని, హాల్ టికెట్ అందని వారు దరఖాస్తు సమయంలో గల అక్నాలెడ్జ్‌మెంట్ కార్డు, ఫొటో, ఆధార్ కార్డుతో హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9550645847కు సంప్రదించాలని సూచించారు.

అవీ-ఇవీ

గుడి అభివృద్ధికి ఆర్థిక సాయం

వెల్దుర్తి: బ్రహ్మగుండం సమీపంలోని ఆంజనేయ స్వామి గుడి మండపంలో బండ పరుపుకు, సీతారాముల ప్రతిమల నిర్మాణానికి గోల్డ్ స్మిత్ లోకేశ్ ఆచారి రూ.5 వేలు ఆర్థిక సాయం చేశాడు. ఇందుకు సంబంధించిన నగదును శనివారం హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు, బుడగ జంగాల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు విభూది బాలు గుడి పూజారికి అందించారు.

వీఓఏల నూతన కమిటీ ఎన్నిక

వెల్దుర్తి: వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేస్తున్న వీఓఏల నూతన కమిటీ ఎన్నిక శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. సీఐటీయూ అనుబంధ వీఓఏ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుంటప్ప ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలిగా పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్, కార్యదర్శిగా మహబూబ్‌బాషా, ట్రెజరర్‌గా మధు, ఉప కార్యదర్శిగా నాగలక్ష్మి ఎన్నికైనట్లు గుంటప్ప తెలిపారు. జిల్లా కమిటీలోకి మండలానికి చెందిన మద్దిలేటి, సూర్యచంద్ర, రాజయ్య శెట్టిలను ఎన్నుకున్నామన్నారు. మండల కమిటీలో సలహాదారులుగా రామచంద్రుడు, కళావతి, రాధమ్మ, శ్రీనివాసులు, లక్ష్మంపల్లె రామచంద్రుడులను నియమించుకున్నట్లు తెలిపారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

మద్దికెర : వేడి గాలులు విపరీతంగా వీస్తున్నాయని గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు పాటిస్తూ వాటి నుంచి రక్షణ పొందాలని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ అన్నారు. శనివారం మండల కేంద్రం మద్దికెరలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వేసవికాలంలో తీసుకునే జాగ్రతలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఎండలో ఎక్కువగా తిరగకూడదన్నారు.

పంట దిగుబడులకు భూసార పరీక్షే కీలకం

కృష్ణగిరి: వ్యవసాయంలో రైతులకు పంట దిగుబడులు రావాలంటే భూసార పరీక్షే కీలకమని పత్తికొండ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు విజయ్‌కుమార్ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఏఓ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆర్‌బీకే సిబ్బందికి భూసార పరీక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సలహాలు, సూచనలు చేశారు. చాలా మంది రైతులు తమ భూముల్లో పంటకు కావాల్సిన పోషక విలువలు తెలియకుండానే అధిక దిగుబడులు సాధించేందుకు రసాయన ఎరువులు విరివిగా వాడి నష్టపోతున్నారని తెలిపారు. దీని వల్ల ఖర్చు పెరుగుతుందే తప్పా ఆశించిన స్థాయిలో దిగుబడులు రావన్నారు. అనంతరం గ్రామ సమీపంలోని పొలాల్లో మట్టి నమునాకు మట్టి సేకరించే విధానాన్ని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ నాగసరోజమ్మ, ఏఈఓ రాజేష్, అన్ని ఆర్‌బీకేల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మద్దికెర: రైతులు భూసార పరీక్షలు చేయించుకుని తగిన జాగ్రత్తలు తీసుకుంటే భూమి సారవంతంగా మారుతుందని ఏఓ హేమలత అన్నారు. శనివారం మద్దికెరలో వీఏఏలు, వీహెచ్ఏలకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అగ్రిల్యాబ్‌లు ఏర్పాటు చేసిందని వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ జాకీర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


భూసార పరీక్షపై అవగాహన కల్పిస్తున్న పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్

భూసార పరీక్షలతో ప్రయోజనం

చిప్పగిరి: భూసార పరీక్షలతో రైతులకు చాలా ప్రయోజనం చేకూరుతుందని ఏఓ ఆనంద్ అన్నారు. భూపరీక్ష వారోత్సవాల సందర్భంగా స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మట్టి నమూనాల సేకరణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. రైతులు ప్రతి మూడేళ్లకోసారి మట్టి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని వారికి సూచించారు.

ఊరూరా జగనన్నే మా భవిష్యత్తు


ఎమ్మిగనూరులో చేనేత కార్మికులతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

గోనెగండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. శనివారం ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మండలకేంద్రం గోనెగండ్లతో పాటు గంజిహళ్లి, హెచ్. కైరవాడి, కులుమాల, పెద్దనేలటూర్, బైలుప్పల తదితర గ్రామాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుత్వ పథకాలు, నాలుగేళ్లలో చేకూరిన లబ్ధి గురించి ప్రజలకు వివరించారు. అలాగే ఆలూరు నియోజకవర్గంలోని చిప్పగిరి మండలం దౌల్తాపురంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీధర్, శేఖన్న, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్న నేస్తంతో జీవితాల్లో వెలుగు

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నేతన్న నేస్తం పథకం చేనేతల జీవితాల్లో వెలుగులు తెచ్చాయని వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని వార్డుల్లో వైఎస్ఆర్‌సీపీ వార్డు కౌన్సిలర్లు, పార్టీ వార్డు ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటింకి వెళ్లి సంక్షేమ పథకాలు గురించి వివరించారు. 1,2వ వార్డుల్లో వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి చేనేతల ఇళ్లకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. జగనన్న పాలనలో వారికి కలిగిన లబ్ధిని వివరించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు సేకరించారు. పార్టీకి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్‌తో పాటు ఆయా వార్డుల పార్టీకౌన్సిలర్లు కామర్తినాగేషప్ప అంపమ్మ, వైఎస్ఆర్‌సీపీ పట్టణ కార్యదర్శి వీరేంద్ర, పార్టీ నాయకులు గట్టుఖాజ, రంగన్న, యిసా, సికిందర్, గజేంద్ర, రాముడు పాల్గొన్నారు.

2024లో వైఎస్సార్‌సీపీదే మళ్లీ అధికారం

కృష్ణగిరి: 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రాబోతుందని జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి, సచివాలయ కన్వీనర్లు సుభాష్, రామచంద్రుడు చెప్పారు. మండల పరిధిలోని పోతుగల్లు, ఆగవేళి, రామకృష్ణాపురం, తొగర్చేడు తదితర గ్రామాల్లో శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గతంలో చంద్రబాబు ఎన్నికల్లో హామీలిచ్చి నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్రంలో నిరుపేదల అభ్యున్నతే ప్రధాన ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు.

రమణీయం.. తిప్పన్న తాత రథోత్సవం


భక్తజనం మధ్య కట్టెల తిప్పన్న తాత రథోత్సవ దృశ్యం

ఆస్పరి: మండలంలోని చిగిళిలో శనివారం శ్రీగిరి కట్టెల తిప్పన్న తాత రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా ఆలయంలో తిప్పన్న తాతకు గంగ, ఆకు పూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు నిర్వహించారు. నందికోలు సేవ, మంగళవాయిద్యాలతో తాత ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం అశేష భక్తజనం మధ్య రథాన్ని గ్రామం చివర ఉన్న ఎదురు బసవన్న ఆలయం వరకు లాగారు. ఈ వేడుకను తిలకించేందుకు గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు.

ఇక ఇంటర్‌లో కలుద్దాం

విద్యార్థి దశకు తొలి మెట్టుగా భావించే పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. విద్యార్థులు ఆనందంగా కేంద్రాల నుంచి బయటకొచ్చారు. పదిలో మంచి గ్రేడ్‌లను సాధించి భవిష్యత్తు కార్యచరణకు సిద్ధం కావాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్గదర్శనం చేశారు. స్నేహితులతో పదేళ్ల స్కూళ్ల జ్ఞాపకాలను తలుచుకుంటూ మళ్లీ ఇంటర్‌లో కలుద్దామని ఇళ్లకు బయలుదేరారు.

- సాక్షి నెట్‌వర్క్


కృష్ణగిరి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల ఆనందోత్సాహం


వెల్దుర్తిలోని పరీక్ష కేంద్రం నుంచి బస్సులో వెళ్తున్న గురుకుల విద్యార్థినులు


హొళగుందలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు